ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
గురువారం 10 ఏప్రిల్ 2025



ప్రమాద ఘంటికలు..

- జిల్లాలో పడిపోతున్న భూగర్భ జల మట్టం
- కొడిమ్యాలలో అత్యధికంగా 11.95 మీటర్ల లోతులోకి..
- పలు ప్రాంతాల్లో వట్టిపోయిన బోర్లు
- నీటిని పొదుపుగా వాడాలంటున్న అధికార యంత్రాంగం
- వరికి ఆఖరి తడి అందక రైతుల ఆందోళన



జగిత్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి ఆరంభం నుంచే ఎండల తీవ్రతతో భూగర్భ జల మట్టం వేగంగా పడిపోతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 41డిగ్రీలకు చేరుకున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ యేడాది ప్రారంభం, ప్రస్తుత పరిస్థితులకు పోల్చితే సుమారు మీటరు నుంచి మీటరున్నర లోతుకు నీటి మట్టం పడిపోయిందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పలు ప్రాంతాల్లో బోర్లు పనిచేయడం లేదు. మరోవైపు ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు సాగు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలో అత్యల్పంగా 2.08 మీటర్ల లోతులో, కొడిమ్యాల మండలంలో అత్యధికంగా 11.95 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి.

● జిల్లాలో 31 ఫ్యూజో మీటర్లు...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటిమట్టాన్ని తెలుసుకునేందుకు ప్రభుత్వం గ్రౌండ్‌వాటర్‌శాఖ ఆధ్వర్యంలో 31ఫ్యూజో మీటర్ల ఏర్పాటు చేసింది. ప్రతీ నెల 15వ తేదీ నుంచి 28వ తేదీ లోపు అధికారులు, సిబ్బంది గ్రౌండ్‌వాటర్ లెవల్స్ వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కడైతే 10మీటర్లలోపు అడుగులో నీరు ఉంటుందో అక్కడ ఇబ్బంది ఉండదని వారు పేర్కొంటున్నారు. 11 మీటర్ల నుంచి 15మీటర్ల లోపు, 15నుంచి 20కి పైగా మీటర్లలోతుల్లో నీటిమట్టం పడిపోతే డేంజర్ జోన్‌లోకి ఆ ప్రాంతం వెళ్లినట్లుగా అధికారులు ప్రకటిస్తారు. వెంటనే అక్కడ వాటర్‌రీచార్జింగ్ పద్ధతిని చేపడతారు.

● పెరిగిన ఎండల తీవ్రత...

జిల్లాలో పెరిగిన ఎండల తీవ్రతతో బయటికి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో ఉక్కపోత కూడా ఎక్కువైంది. దీంతో మే నెలలో ఇంకా భూగర్భ జలమట్టం పడిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు వట్టిపోయాయి. బోర్లపైనే ఆధారపడి పంటలు పండిస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పంటలను కాపాడుకోవడానికి రూ.లక్షల్లో వ్యయం చేసి బోర్ల తవ్వకం చేపట్టినా ఫలితం అంతంత మాత్రంగానే ఉంటోంది. జిల్లాలో 509 గ్రామ పంచాయతీ చెరువుల కింద 3,130 హెక్టర్ల నీటి విస్తీర్ణం, 185 మత్స్య శాఖ చెరువుల కింద 15,162 హెక్టార్ల నీటి విస్తీర్ణం ఉంది. రాతిపొరలు, కఠిన శిలలు గల గ్రానైట్ రాతి 80 శాతం, ఎర్ర, నల్ల రాయి 20శాతం ఉంది.

జిల్లాలో భూగర్భ జలాల వివరాలు (మీటర్లలో...)

మండలం	ఫిబ్రవరి	మార్చి
బీర్‌పూర్	1.72	2.08
బుగ్గారం	4.50	5.20
ధర్మపురి	5.47	5.81
ఎండపల్లి	8.30	7.77
గొల్లపల్లి	5.45	4.70
జగిత్యాల రూరల్	3.00	2.55
జగిత్యాల అర్బన్	7.70	8.05
పెగడపల్లి	4.80	4.31
రాయికల్	3.38	3.91
సారంగాపూర్	5.66	5.98
వెల్గటూరు	3.15	3.54
కొడిమ్యాల	10.75	11.95
మల్యాల	6.00	6.92
ఇబ్రహీంపట్నం	5.27	4.26
కోరుట్ల	8.52	9.77
మల్లాపూర్	5.34	5.86
బీమారం	4.75	4.01
కథలాపూర్	2.70	3.15
మేడిపల్లి	4.66	4.92
మెట్‌పల్లి	4.93	6.10
జిల్లా సగటు	4.86	5.24

ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ బకాయిలు చెల్లించాలి

● డీఈవోకు పీఆర్టీయూ నాయకుల వినతి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత సంవత్సరం ఎస్సెస్సీ విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన కేజీబీవీ ఉపాధ్యాయులకు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లాశాఖ బాధ్యులు డీఈవో రామును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాళ్ల అమర్నాథ్‌రెడ్డి, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

'విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు'



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గంగారాం సిబ్బందికి సూచించారు. మెట్‌పల్లి పట్టణంలోని ఓ కల్యాణ భవనంలో మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందితో లైన్ క్లియరెన్స్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. గతంలో ఒక ఫీడర్ నుంచి ఇంకో ఫీడర్ మరమ్మతుల కోసం తీసుకున్న లైన్ క్లియర్‌తో ప్రమాదాలు చోటు చేసుకునేవన్నారు. వాటి నివారణకు ప్రస్తుతం సీఎండీ రూపొందించిన పద్ధతి ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా దీనిపై అవగాహన కలిగి ఉండి విద్యుత్ మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు, మనోహర్, హరీష్, అంజన్ రావు, రఘుపతి, ఏఈలు సబ్ ఇంజనీర్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తాం'

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా సహకరించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. పట్టణంలోని స్థానిక కమల నిలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నమాట అంటే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పార్టీ మారే క్రమంలో తన మంత్రి పదవితో పాటు, పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష పార్టీలో జాయిన్ అయ్యాడని పేర్కొన్నారు. తాను కూడా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశాకనే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచానని గుర్తు చేశారు. సంజయ్ కుమార్‌కుకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎమ్మెల్యేగా గెలవాలని శ్రావణి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, ఉపాధ్యక్షుడు పవన్‌సింగ్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళావతి, పట్టణ అధ్యక్షురాలు దురిశెట్టి మమత, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలో చిన్నగట్టు పంచముఖ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్‌లను బుధవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పిప్పర శేఖర్, న్యాయవాది చింతకుంట శంకర్, నాయకులు బోడ్డు సుధాకర్, సజ్జనపు కృష్ణానంద్, గంటా ప్రవీణ్ రావు, గుండు ప్రభాకర్, నర్సింహాచారి, తోగిటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కథలాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నండ్యారపు వెంకటేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రియాశీల సభ్యుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజలు మోదీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాదరణ పొందిన పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.

గ్రామీణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, కథలాపూర్ మహేశ్, నరెడ్ల రవి, శాంతారాం, సాయిరెడ్డి, వినయ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఏఆర్‌టీ ఉద్యోగులకు ఏజెన్సీ గండం

- ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించే యత్నం
- హెచ్‌ఐవీ బాధితులకు కౌన్సెలింగ్‌లో కీలకపాత్ర
- ఆందోళనలో 800 మంది ఉద్యోగులు



జగిత్యాల ఏఆర్‌టీ సెంటర్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులకు సేవలు అందించే నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లాల్లోని ఏఆర్‌టీ (యాంటీరిట్రోవైరల్ థెరపీ) కేంద్రాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయస్థాయిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కింద అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 800మంది ఉద్యోగులు20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కాగా జిల్లాలో 17మంది పని చేస్తున్నారు. వీరు హెచ్‌ఐవీ బాధితులను ఏఆర్‌టీ కేంద్రానికి పంపించి కౌన్సెలింగ్ చేసి మందులు అందిస్తారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ అన్ని రాష్ట్రాలు అప్రైజల్, బాండ్ రెన్యూవల్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఉంటుంది. ఈ విధంగా పంపించే అప్రైజల్‌లో ఉద్యోగి పనితీరు తెలియజేయడంతో పాటు బాండ్ సంవత్సరం అగ్రిమెంట్‌గా ఉపయోగపడుతుంది. అయితే దశాబ్ద కాలంగా ఏ ఒక్కరోజు కూడా సర్వీస్ బ్రేక్ ఇవ్వకపోవడంతో పాటు ఏ ఒక్క ఉద్యోగి జీతం కట్ చేయలేదు. అయితే ఇప్పుడు కొత్తగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండా 31-03-2025 రోజున ఉద్యోగుల జీతాలు రద్దు చేయడంతో వారికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అయితే నేషనల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్రాలకు పంపించిన అగ్రిమెంట్ అన్ని రాష్ట్రాలకు సమానంగా ఉండగా, తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పంపించిన బాండ్ తమ వ్యతిరేకంగా ఉందని, తమ జీవితాలను ఇబ్బందుల పాలు చేసే విధంగా ఉందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 సంవత్సరాలుగా పనిచేస్తున్నాం



మేము 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తూ ఎప్పటికైనా తమకు మంచి రోజులు వస్తాయని ఆశతో బ్రతుకుతున్నాం. ఇప్పుడు కాంట్రాక్ట్ ఉద్యోగం తీసివేసి ఏజెన్సీలకు అప్పగించడం వల్ల మా సీనియార్టీకి ముప్పు వాటిల్లడంతో పాటు భవిష్యత్‌లో ఏఆర్‌టీ సెంటర్లలో పని చేశామని గుర్తింపు కోల్పోతాం. ముఖ్యమంత్రి స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపించాలి.

- రంజిత్, ఏఆర్‌టీ జేఏసీ

ఏజెన్సీలకు అప్పగించొద్దు..



రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనంతో ఎయిడ్స్ రోగులకు సేవలు చేస్తున్నాం. మమ్మల్ని ఇబ్బంది పెట్టే విధంగా కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో మేము తమ సీనియార్టీ కోల్పోవడంతో పాటు ఏఆర్‌టీ ఉద్యోగుల మనుగడకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

- తుమ్మల అనిల్, జగిత్యాల

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● విప్ ఆది శ్రీనివాస్



భూషణరావుపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కథలాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోసానిపేట, భూషణరావుపేట గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించారని గుర్తు చేశారు. రైతాంగం తమ ధాన్యంను దళారులకు అమ్ముకోకుండా కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరకే విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైఎస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

హన్‌మాన్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

- కొండగట్టులో రేపటి నుంచి ప్రారంభం
- అంజన్నను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు
- 12న చిన్న హన్‌మాన్ జయంతి

5



కొండగట్టులో మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

● జగిత్యాల జిల్లా ఉద్యాన అధికారి శ్యాం ప్రసాద్



ఆయిల్‌ఫామ్ పంటసాగు పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్యాంప్రసాద్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జగిత్యాల జిల్లా ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ రైతువేదికలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ఎడిబుల్ ఆయిల్స్ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఉద్యానశాఖ అధికారి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేస్తే చీడ, పీడల బెడద ఉండదని ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 21 వేలకు చేరిందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పంట ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేయడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెద్దఎత్తున సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఏఈవోలను గాని, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్లను గాని సంప్రదించి దర ఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి స్వాతి, లోహియా మేనేజర్ విజయ్‌భరత్, పట్టుఅధికారిభరత్, ఏఈఓ రవళి, మానిటరింగ్ ఆఫీసర్ అన్వేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఉదయశ్రీ, రైతులు పాల్గొన్నారు.





ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి పర్యవేక్షణలో బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 66వాహనాల యజమానులకు జరిమానా విధించారు. కరీంనగర్ వన్‌టౌన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనల ప్రకారం నంబర్లు ప్లేట్ లేని వాహనాలతోపాటు, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, శబ్దకాలుష్యం వంటి కారణాలపై వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ భద్రతదృష్ట్యా ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్‌ఎస్సైలు ఉపేంద్రాచారి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గోకుల్‌నగర్‌కు చెందిన గీతకార్మికుడు గర్రెపల్లి వెంకటేష్(49)బుధవారం నూతుల కుంట కరకట్టపై గల తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కల్లుకుండలను దించుతున్న సమయంలో కాలుజారి కిందపడ్డాడు. తోటి గీతకార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏఎల్పీలో ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

రామగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్పీలో బుధవారం మొదటి షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో సర్ఫేస్(బ్లాక్‌స్మిత్) కార్మికుడు మద్ది బీరయ్య గాయపడ్డాడు. ఏఎల్‌పి ప్రాజెక్టులోని పనిస్థలాల్లో క్రానికల్ అబ్లాంగ్ పనులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో బీరయ్య మోకాలుకు గాయాలయ్యాయి. కార్మికుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గంభీరావుపేటలోని పురాతన రామాలయం

రామయ్య సన్నిధిలో

అఖండజ్యోతి

- 700 ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం
- రాతితో నిర్మించిన కల్యాణ మండపం
- గంభీరావుపేట రామాలయం ప్రత్యేకత
- ఆలయంలో కొనసాగుతున్న బ్రహోత్సవాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని పురాతన శ్రీ సీతారామాలయంలో వెలిగే అఖండ నంద దీపానికి ప్రత్యేకమైన విశిష్టత. దాదాపు 700 ఏళ్ళుగా ఆరకుండా నంద దీపం వెలుగుతూనే ఉంది. రామాలయాన్ని కాకతీయుల చివరి రాజైన ప్రతాప రుద్రుడు దాదాపు 1333లో నిర్మించినట్టు ఆలయంలోని గంటపై చెక్కిన తెలుగు అంకెల ఆధారంగా తెలు స్తోంది. ఆలయంలో మూల విగ్రహ ప్రతిష్ఠకు ముందు అఖండ నంద దీపాన్ని ఏర్పాటు చేయగా, నాటి నుంచి నేటివరకు వెలుగుతునే ఉంది.

ప్రారంభమైన బ్రహోత్సవాలు..

శ్రీసీతారామాలయంలో శ్రీరామనవమి నుంచి స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణం మొదలుకొని తొమ్మిది రోజులు పాటు బ్రహోత్సవాలు వైభవంగా సాగుతాయి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా స్వామి వారి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. స్వామివారిని అశ్వ, గజ, హనుమ, పొన్న, గరుడ సేవలపై ఊరేగిస్తారు. చివరి రోజున స్వామి వారు రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారు.

16 స్తంభాలతో కల్యాణ మండపం

శ్రీ సీతారామాలయంలో 16 స్తంభాలతో కూడిన కల్యాణ మండపం అత్యంత సుంద రంగా రాతితో నిర్మించారు. ఏటా భద్రాచలంలో జరిగే విధంగా అదే సమయంలో రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్స వాన్ని నిర్వహిస్తారు. కోరిన వారికి కోర్కెలను తీరుస్తాడని శ్రీ రామచంద్ర మూర్తిపై ఇక్కడి ప్రజలకు ప్రగాఢ విశ్వాసం.



భక్తుల కొంగు బంగారం..

మల్లుగారి నర్సాగౌడ్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్



గంభీరావుపేట పురాతన రామాలయంలోని శ్రీరామచంద్రమూర్తి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరజిల్లుతున్నారు. రామాలయానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. సంతానం లేని వారు భక్తిశ్రద్ధలతో కొలిస్తే తప్పకుండా స్వామి అనుగ్రహం ఉంటుంది. ప్రతీ ఏటా శ్రీరామ నవమి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.



రాతి కట్టడాలతో నిర్మించిన 16 స్తంభాల కల్యాణ మండపం

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలోపడి చిన్నారి మృతి



గడ్డం జశ్విత(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట గ్రామంలో చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలో పడి మృతిచెందింది. పోలీసులు, చిన్నారి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నవివరాల ప్రకారం.. పెద్దపల్లిజిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన గడ్డం అజేందర్‌రెడ్డి కూతురు జశ్విత(3)ను మూడు రోజుల కిందట బహదూర్‌ఖాన్‌పేటలోని పెద్దమ్మ, పెద్దనాన్నలు వారి ఇంటికి తీసుకెళ్లారు. గురువారం జశ్వితతోపాటు ఆమె పెద్దమ్మ, పెద్ద నాన్న, వారి కొడుకు అభిరాంరెడ్డి పొలం వద్దకు వెళ్లారు. చింతచెట్టు కొట్టేందుకు పనివాళ్లు రాగా అక్కడే ఉన్న ట్రాక్టర్‌ను అభిరాంరెడ్డి పక్కకు తీసుకెళ్లి వ్యవసాయబావివద్ద నిలిపాడు. ఆసమయంలో అభిరాంరెడ్డితో పాటు జశ్విత కూడా డ్రైవర్ సీటు పక్కనే కూర్చుంది. ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్‌చేసిన అభిరాంరెడ్డి తాళంచెవి దానికే ఉంచి కిందకు దిగాడు. జశ్విత ఆ తాళంచెవితో ట్రాక్టర్‌ను ఆన్ చేసింది. దీంతో గేర్‌లో ఉన్న ట్రాక్టర్ పక్కనేఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌తోపాటు జశ్విత కూడా బావిలో పడింది. వెంటనే ఆమెను బయటకు తీసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జశ్విత మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. అభిరాంరెడ్డి నిర్లక్ష్యంగా తాళం చెవి ట్రాక్టర్‌కు వదిలివెళ్లి ప్రమాదానికి కారణమయ్యాడని చిన్నారి తండ్రి గడ్డం అజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపుంజును పట్టుకునేందుకు వెళ్లి.. వ్యవసాయ బావిలో పడి మృతి



రాజేశం (ఫైల్)

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లె గ్రామానికిచెందిన నామని రాజేశం(70)అనేవ్యక్తి బుధవారం కోడి పుంజును పట్టుకునే క్రమంలో వ్యవసాయబావిలో పడి మృతిచెందాడు. వివరాలు ఇలాఉన్నాయి. వరిపంట కోతలు ప్రారం భించడానికి సంప్రదాయంలో భాగంగా పోతలింగన్న గుడివద్ద కోడి పుంజును కోస్తారు. కోడిపుంజును కొనుక్కొని సంచిలో పెట్టుకొని రాజేశం గుడి వద్దకు వెళ్లాడు. సంచిలో నుంచి కోడిపుంజును బయటకు తీయగా ఒక్కసారిగా ఎగిరిపోయిన వ్యవసాయ బావిలో పడింది. దానిని పట్టుకునే క్రమంలో రాజేశం ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడ్డాడు. ఆ సమయంలో ఆప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో రాజేశం బావిలోనే మృతిచెందాడు. పొలంవద్దకు వెళ్ళిన రాజేశం తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పొలంవద్దకు వెళ్ళి పరిశీలించగా బావిలో పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అఫ్రోజ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడగా, ఈనెల 7న ఒకరు మృతిచెందగా, మరొకరు బుధ వారం మృతిచెందారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మరణించడంతో రెండు కుటుంబాల్లో విషాదాన్ని నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని మౌలాని-రఫీక్ దంపతుల చిన్న కొడుకు అఫ్రోజ్(20) ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. రంజాన్ పండుగకు అదే గ్రామంలోని తన చిన్నమ్మ కొడుకు ఆవేజ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు బయలుదేరారు. హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సిరిసిల్ల నుంచి వస్తున్న ఆటో, అటు వైపునకు వెళుతున్న యువకుల బైక్‌లు ఢీకొన్నాయి. అవేజ్, అఫ్రోజ్‌లతో పాటు ఆటో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆవేజ్, అఫ్రోజ్‌ల పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఈనెల 7న ఆవేజ్ చనిపోయాడు. మరో యువకుడు అఫ్రోజ్ బుధ వారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు మౌలానీ, రఫీక్, సోదరులు అబ్బాస్, అబ్దుల్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన సంగెపు మహేష్ (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన మృతుడు మహేష్ ఉపాధి నిమిత్తం ముంబైలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడు 10 సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 7న తమ బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండడంతో జగదేవ్‌పేట గ్రామానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సంగెపు మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాణినగర్‌కు చెందిన ఆరుముల్ల గంగారాం తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. దొంగలు వాహనాన్ని బుధవారం అపహరించుక వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇరుక్కుపోయిన డ్రైవర్
- గంటపాటు శ్రమించి బయటికి తీసిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వె స్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఒక ప్రయాణికురాలికి గాయాలు కాగా హార్వెస్టర్ డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో రాజీవ్‌రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన శ్రీనుకి చెందిన హార్వెస్టర్ గంగాధరలో పనుల నిమిత్తం మంగళవారం రాత్రి బయలుదేరి వెళుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. దీంతో హార్వెస్టర్ పల్టీకొట్టుకుంటూ రోడ్డు మధ్యలో ఉన్నడివైడర్ పైనుంచి హైదారాబాద్ వైపు రాజీవ్ రహదారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్ డ్రైవర్ పంజాబ్‌కు చెందిన కౌశల్ సింగ్ అందులోనే ఇరుక్కుపోగా అందులోనే ఉన్న మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు, బ్లూకోట్స్ సిబ్బంది గంట సేపు కష్టపడి హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్‌సింగ్‌ను బయటకు తీశారు. కౌశల్‌సింగ్ కాలు విరగగా, బస్సులో ప్రయాణిస్తున్న మల్యాలకు చెందిన అంజలికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 50మంది వరకు ఉన్నారు. బస్సు ముందు భాగం మొత్తం ధ్వంసం అయింది. క్షతగాత్రులను 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్ సింగ్

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం/వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడిసెలపేట గ్రామానికి చెందిన రెబ్బస్ పోచయ్యకు గట్టయ్య, లచ్చయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తన ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇవ్వగా గట్టయ్య వాటాను లచ్చయ్య కొనుగోలు చేశాడు. అప్పటినుండి పోచయ్య తన భార్యతో కలిసి పెద్దకుమారుడు లచ్చయ్య ఇంటిలో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కుమారుడు లచ్చయ్యకు, తండ్రిపోచయ్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తనఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ 2022ఏప్రిల్ 1న మరోసారి ఇద్దరిమధ్య గొడవజరగగా కర్రతో తండ్రిని లచ్చయ్య విచక్షణారహితంగా చితకబాదాడు. తీవ్రగాయాలైన పోచయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేయగా సీఐ కోటేశ్వర్, ఎస్సై నరేష్‌లు కేసును విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాధించారు.

నేరం రుజువు కావడంతో ముద్దాయి లచ్చయ్యకు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నరైతులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోయి బోరు బావులు ఎండిపోతున్నాయి.. నీళ్ల లేక తల్లడిల్లుతున్నాం.. తమ గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తీస్తే ఊరుకోబోమంటూ ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఇసుకను రవాణా చేసేందుకు వాగు వద్దకు చేరుకున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. వేరే గ్రామాల వారు వాగు నుంచి తరలిస్తే తమ పంట పొలాలు ఎండిపోతాయని వాపోయారు. సమాచారం అందుకున్న తహసీల్ అధికారులు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి యత్నించిన ఫలితం లేకుండాపోయింది. చేసేదేమీ లేక ట్రాక్టరు డ్రైవర్లు అక్కడ నుంచి వెనుదిరిగారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ధర్మపురి/శంకరపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల ఒకవాగులో పడి శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు మల్లమ్మ(89) అనే వృద్ధురాలు మృతి చెందింది. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమ్మె వేతనాలు ఇవ్వాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమ్మెకాలం వేతనాలు, వేసవిసెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరుణాకుమారి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరుణాకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీటీచర్స్, హెల్పర్స్‌కు రిటైర్మెంట్‌బెనిఫిట్స్, సమ్మెకాలం వేతనాలు, పీఆర్‌సీ 30శాతం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను రెండవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కనీసవేతనాల జీవోను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18లు నెలకు ఇవ్వాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అంతిమ సంస్కారాలకు టీచర్లకు రూ. 20 వేలు, హెల్పర్‌కు రూ. 10వేలు సౌకర్యం కల్పించాలన్నారు ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ టీచర్ హెల్పర్‌కు కనీసం నెలకుపెన్షన్ రూ.3వేలుఇవ్వాలన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు అన్‌లైన్‌లో విడివిడిగా అన్‌లైన్ చేయడం పని భారంగా మారిందని పని భారం తగ్గించాలని అన్నారు. ఆ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ, గౌరవ అధ్యక్షుడు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులక్రితం ఆత్మహత్యహత్నాయత్నం చేసిన వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లిమండలం గొడిశెలపేట గ్రామానికిచెందిన అల్లె లచ్చయ్య (58) అనేవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సైఉమాసాగర్ కథనం ప్రకారం.. లచ్చయ్య కూలిపనిచేసు కుంటూ జీవిస్తున్నాడు. అతడు 15సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధప డుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఈనెల7న గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. జగిత్యాలలో చికిత్స పొందుతూ పరిస్థితివిషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుని భార్య అల్లెవిజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చెరాల లింగయ్య(78) అనే వృద్ధుడు పరుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లింగయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులుచూసి అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు లింగయ్యను 108లో హుజూరాబాద్ ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

తనతండ్రి అనారోగ్యానికి గురి కావడం, ఒంటరితనం భరించలేక పురుగుల మందుతాగి ఆత్యహత్య చేసుకొని ఉంటాడని మృతుడి కొడుకు చెరాల మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

కోరుట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (22) అనే వివాహిత ఆత్మహత్యకు కుటుంబ కలహాలు, భర్త వేధింపులే కారణమనే తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రంజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండు రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రంజిత తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంజిత గత సంవత్సరం అక్టోబర్‌లో పవన్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. రంజిత, పవన్ దంపతులు అయ్యప్ప గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. పవన్ మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బుల విషయంలో తన కూతురుతో గొడడ పడడంతో పాటు అతడి కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేసే వారిని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండానే పనులు ప్రారంభిస్తారా?

- పనులను అడ్డుకున్న భూయజమానులు

వేములవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండానే తమ సొంత భూముల్లో ప్రభుత్వ పనులు ఎలా ప్రారంభిస్తారని యజమానులు అధికారులు ప్రశ్నించారు. వేములవాడపట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి డ్రైనేజీద్వారా వస్తున్న మురుగునీరు గుడిచెరువులో కలవకుండా మళ్లించేందుకు దాదాపు మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు బుధవారం పనులు ప్రారంభించగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తమ అనుమతి లేకుండానే పనులు ఎలా ప్రారంభిస్తారు అంటూ సంబంధిత భూయజమానులు అడ్డుకున్నారు. అధికారికంగా సమాచారం ఇచ్చి, తగిన పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేపట్టాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ అన్వేష్ మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్ భూములలోనే పనులు చేస్తున్నామని, పనులు ఆపబోమని స్పష్టం చేశారు. భూ యజమానులు లాలనర్సింగం, ఫసియుద్దీన్, రామారావు, ఈర్లపల్లి రాజు, శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.



అధికారులను ప్రశ్నిస్తున్న భూ యజమానులు

బేకరీకి రూ.20 వేల జరిమానా

కోల్‌సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ప్రజారోగ్యవిభాగం సిబ్బంది బుధవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని సిరికేక్స్ అండ్ మోర్‌లో తనిఖీలు జరిపింది. ఈ తనిఖీల్లో కేకుల తయారీలో వినియోగించే రసాయనాలు కాలం చెల్లినవిగా గుర్తించారు. వీటితో పాటు మరికొన్ని కాలం చెల్లిన పదార్థాలను సీజ్ చేశారు. షాపు నిర్వాహకులకు రూ.20వేల జరిమానా విధించారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



బేకరీ నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న కార్పొరేషన్ అధికారులు

డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ సమీక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి.రాజు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపోల్లో ఆపరేషన్స్, మెకానికల్ విభాగాల పనితీరు, డిపోల ఆర్థిక పరిస్థితిపై సమీక్షించారు. వేసవిలో బస్ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. మహాలక్ష్మి పథకం రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు వెంకటేశ్వర్‌రావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పని చేసిన సర్పంచులపై పాలకుల వివక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసిన సర్పంచులపై పాలకులు వివక్ష చూపిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, గ్రామ పంచాయతీల పురోగతిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆరు గ్రామాలు ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 25 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధిస్తే వాటిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే తిమ్మాపూర్ (కరీంనగర్)బండపల్లి (చందుర్తి మండలం), గంగ్రపల్లి (జమ్మికుంట), బల్వంతాపూర్ (మల్యాల), రుద్రంగి, ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలు మెరుగైన ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా పంచాయతీల్లో కీలకంగా పనిచేసిన నాటి సర్పంచులు, అధికారులకు అభినందనలు తెలిపారు. కష్టపడి పనిచేసిన మాజీ సర్పంచులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపడం సహించరాని విషయమని తెలిపారు. ప్రజల కోసం అప్పులు చేసి ఆస్తులు అమ్మి పంచాయతీలను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.ఇకనైనా మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించాలన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందికి ఆన్‌లైన్ ఎల్‌సీపై శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఆన్‌లైన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్‌ను ప్రవేశపెడుతున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్ బాబు తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. 11కెవి, ఎల్‌సి మొబైల్ యాప్ మీద ట్రైనింగ్‌లో భాగంగా టౌన్ వన్ సబ్ డివిజన్ టౌన్‌టు సబ్ డివిజన్ అలుగునూరు సబ్ డివిజన్ ఏఈలకు, సిబ్బందికి, సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సమాచారలోపం ఇతర కారణాలతో ఎల్‌సీ తీసుకున్నపుడు చాలా తప్పులు జరుగుతున్నాయన్నారు. ఈ యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.

కొండగట్టులో హనుమాన్
జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు



- రేపటి నుంచి ప్రారంభం
- అంజన్నను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు
- 12న చిన్న హన్‌మాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్నహనుమాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే ఈ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపుగా మూడు లక్షలకుపైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. జయంత్యుత్సవాలకు 41 రోజుల ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా మాల విరమణ చేస్తారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పుతూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు, ఇతరత్రా ఏర్పాట్లును అధికారులు చేస్తున్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతుండగా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతాయి. ప్రతి ఏటా చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41 రోజులకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హనుమాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హనుమాన్ దీక్షపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు గాను దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. శనివారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరగనుంది. ఇందుకుగాను రెండు రోజులుగా దీక్షాపరులు కొండగట్టుకు రావడంతో సందడి నెలకొంది.

ఇబ్బందులు లేకుండా చూడాలి
కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగే జయంత్యుత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు లైటింగ్, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి 13వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. 14 కౌంటర్లు ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల ప్రసాదాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయ ప్రాంగణంలో 64 సీసీ కెమెరాలు ఉండగా అదనంగా 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లన్నారు. 6 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కొండపైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను పెంచాలన్నారు. కల్యాణ కట్ట వద్ద ఎక్కువ మంది నాయీ బ్రాహ్మణులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక కుమార్, ఆర్‌డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, కలెక్టరేట్ ఏవో హకీం పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్రలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 9: ఈ నెల 12వ తేదీ శనివారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వివిధ పుణ్య క్షేత్రాలకు పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పలువురు ఆంజనేయస్వామి దీక్షాపరులు బుధవారం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తూ నగరానికి చేరుకున్నారు. మొత్తం 250 కి.మీ ప్రయాణం ప్రారంభించినట్లు, వేములవాడ, కొండగట్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. మే 22న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు విజయవాడ, భద్రాద్రి, యాదాద్రి, ఇల్లందకుంట, వేములవాడ, కొండగట్టు, అగ్రహారం, ధర్మపురి, కాళేశ్వరం, తిరుమల జాపాలి తదితర ప్రాంతాలకు తరలి వెళ్లనున్నారు.



పాదయాత్రగా వెళుతున్న దీక్షాపరులు







మాట్లాడుతున్న జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్, కొండగట్టులో ప్రవేశద్వారం వద్ద స్వాగత తోరణాలు, లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

రేపు సిరిసిల్ల జిల్లాకు నలుగురు మంత్రుల రాక..

- అపెరల్ పార్కులో టెక్స్‌పోర్ట్ యూనిట్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



టెక్స్‌పోర్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఈనెల 11న నలుగురు మంత్రులు రానున్నారు. అపెరల్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన టెక్స్‌పోర్టు యూనిట్‌ను పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. టెక్స్‌పోర్టు యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల డీటీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు ఉన్నారు.

మానేరు వాగులో చెక్ డ్యాంను పునర్‌నిర్మించాలి..

పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణ శివారులో మానేరు వ్యాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను ఈఎన్‌సీ శంకర్‌తో కలిసి పరిశీలించారు. పునర్నిర్మాణ పనులను చేపట్టాలని మానేరు బ్రిడ్జి నుంచి మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పునర్ నిర్మించాలని అన్నారు. ఆయన వెంట ఈఈలు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

పోలీసులు అంకిత భావంతో పనిచేయాలి
డీఐజీ సన్నీ



గదులను ప్రారంభిస్తున్న డీఐజీ సన్నీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసలు అంకిత భావంతో పనిచేయాలని డీఐజీ సన్నీ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో నిర్మించిన ఆయుధ కారాగారాన్ని బుధవారం వర్చువల్ పద్ధతి ద్వారా అడిషన్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్ హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. అలాగే బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ సన్నీ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన దోబీ, బార్బర్ రూంలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఐజీ సన్నీ మాట్లాడుతూ బెటాలియన్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులను నిర్వహించాలని సూచించారు. బెటాలియన్ అభివృద్ధిలో సిబ్బంది ముఖ్య ప్రాత పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన మహామ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు

● ఈ నెల 12న జాతర ● క్యూలైన్లు, హోమశాల ఏర్పాటు



ముస్తాబైన ఆలయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం చిన్న కలువల గ్రామంలో వెలిసిన మహామ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిగా పిలువుబడుతున్న మహామ్మాయి ఆలయ బ్రహ్మోత్సవాలు యేటా అంగరంగ వైభవంగా జరుగుతాయి. విశ్వకర్మలు, విశ్వబ్రాహ్మణ అనుబంధ కులస్తుల ఆరాధ్య దైవం. మహామ్మాయి దేవాలయం హుస్సేనిమియావాగు ఒడ్డున ఉంది. ఇక్కడ అమ్మ వారు స్వయంభూగా వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ముంబాయిలో మొదటి శక్తిపీఠం ఉండగా రెండోది చిన్న కలువల మహామ్మాయి అమ్మవారి అలయంగా పరిగణి స్తున్నారు. శాతవాహనుల కాలం నాటి ఆలయం ఇది. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వస్తారు. ఉమా మహేశ్వర కల్యాణంతోపాటు అర్చనలు, అభిషేకాలు,కుంకుమ పూజలు నిత్య హోమాలు నిర్వహిస్తారు. వారం రోజులు సాగే పూజలలో నిత్యాన్న దానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్తలు తెలిపారు.



అమ్మవారు

భక్తులకు సౌకర్యాలు కల్పించాం

దేవరకొండ కృష్ణామాచార్యులు, బ్రహ్మోత్సవ నిర్వాహకులు

ఈ నెల 12 వరకు కొనసాగే మహామ్మాయి దేవి ఆలయ బ్రహ్మోత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశాం. చల్లని తాగునీరు, వారం రోజుల పాటు అన్న దానం ఏర్పాట్లు చేశాం. కరీంనగర్ సుల్తానాబాద్ వైపు నుంచి వచ్చే వారు తమ వాహనాలు చిన్నకలువల ఊరిలోపలి నుంచి దేవాలయం వరకు రావచ్చు. గోదావరిఖని, రామగుండం, మంథని, మంచిర్యాల వైపు నుంచి వచ్చే వారు పెద్దకలువల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క నుంచి కాలువ మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు.



అన్నదానం కోసం నిర్మించిన షెడ్డు

రైతుల కోసం ఏఐ క్రాప్ కేర్ యాప్

● వ్యవసాయంలో నష్టం రాకుండా యాప్‌ను రూపొందించిన జ్యోతిష్మతి విద్యార్థులు ● అమెరికాలో ఇంటర్న్‌షిప్ కోసం ఆహ్వానం



పంటల పైన చేస్తున్న పరిశోధనలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి, రైతుల కష్టాలు చూసిన వారు.. ఎలాగైనా రైతులకు మేలు చేసే విధంగా తమ వంతు ఏదైనా చేసి చూపించాలనే దృఢ సంకల్పంతో ఓ యాప్‌ను రూపొందించారు. అంతే కాకుండా దానిపై పరిశోధనలు చేసేందుకు అమెరికాకు వెళ్లేందుకు అవకాశాన్ని దక్కించుకున్నారు. స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో సీఎస్ఈ- 4వ సంవత్సరం చదువుతున్న అజిత్, సీఎస్ఎం 4వ సంవత్సరం చదువుతున్న అక్షిత్, సీఎస్ఈ 4వ సంవత్సరం చదువుతున్న రమేష్ కలిసి కలిసి ఒక టీంగా ఏర్పడ్డారు. రైతులు పండించే పంటలపై పరిశోధనలు నిర్వహించారు. ఇందుకోసం క్రాప్ కేర్ యాప్‌ను రూపొందించారు.

● **యాప్ ఉపయోగం:** భారతదేశ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వ్యాధులను గుర్తించేందుకు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు విద్యార్థులు ప్రాజెక్టు ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరికరాన్ని రూపొందించారు. ఈ ఏఐ ఆధారిత క్రాప్‌కేర్ యాప్‌లో ముందుగా రైతులు తమ పంటకు సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ పంటకు ఏమైనా వ్యాధి సోకిందా, దానిని ఏ విధంగా తగ్గించవచ్చు అనేది సూచిస్తుంది. పంట పండించక ముందే మార్కెట్‌లో ఎంత ధర ఉండే అవకాశం ఉంది, అసలు ఏఏ పంటలు పండిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందనేది ముందుగానే యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. సీజన్‌ను బట్టి ఏ పంటలు వేస్తే బాగుంటుందనేది కూడా యాప్ తెలియజేస్తుంది. రైతులు నష్టాల బారిన పడకుండా ముందస్తుగా ఒక అవగాహనకు వచ్చేందుకు ఈ యాప్ దోహదపడుతుంది.

ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది

జువ్వాడి సాగర్‌రావు, చైర్మన్, జ్యోతిష్మతి విద్యా సంస్థలు



తమ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునాతన ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని అమెరికాలో నిర్వహించే పరిశోధనలో పాల్గొనేందుకు తమ విద్యార్థులు ఎంపికకావడం సంతోషంగా ఉంది. ఇలాంటివి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. విద్యార్థుల పరిశోధనలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాం.



క్రాప్ కేర్ యాప్ రైతులకు ఎంతో మేలు

అజిత్, అక్షిత్, రమేష్, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల

రైతుల కోసం ఏఐ ఆధారిత క్రాప్ కేర్ యాప్ రూపొందించడం చాలా సంతోషంగా ఉంది. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుంది. ఒక్క పంట ఫొటోతో మొత్తం పంటకు సంబంధించిన వివరాలు యాప్ తెలుస్తాయి. ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి. ఏఏ పంటలు వేస్తే లాభాలు ఉంటాయి. మద్దతు ధరతో సహా అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. రైతులకు ఈ యాప్ సహాయకారిగా ఉంటుంది.

అఖిల భారత హ్యాండ్‌బాల్ పోటీలకు
ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పులి మాధవి, అనుపురం సాయికృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ నెల 7 ప్రారంభమైన అఖిల భారత పోలీస్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన పులి మాధవి, అనుపురం సాయికృష్ణ ఎంపికయ్యారు. రామడుగుకు చెందిన అనుపురం సయికృష్ణ మంచిర్యాల 13వ బెటాలియన్ నుంచి, కురుమపల్లికి చెందిన పులి మాధవి రామగుండం కమిషనరేట్ నుంచి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, పెటాటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పీడీలు అభినందించారు.

ఆరుబయట వంట.. తప్పని తంటా..



వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం, నిలువ చేసిన టమాటాలు, గుడ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని వంట గదులు
- మధ్యాహ్న భోజనం నిర్వాహకుల ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, గుండారం, అక్కపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసేందుకు సరైన వంట గదులు లేవు. దీంతో నిర్వాహకులు ఆరు బయట చేయాల్సి వస్తోంది. ఇరుకుగా ఉన్న వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం ఏర్పాటు, అందులోనే కూరగాయాలు, ఇతర సామగ్రి నిల్వ చేయడం వల్ల వంట తయారుకు స్థలం లేకుండాపోతోంది. దాంతో వంట నిర్వాహకులు ఆరుబయట చెట్లు, అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల స్లాబ్‌ల కింద భోజనం తయారుచేస్తున్నారు. వంట చేసేందుకు ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను అందించకపోవడం వల్ల కట్టెల పొయ్యిపై వండాల్సి వస్తోంది. దాంతో తీవ్రమైన పొగ తరగతి గదుల్లోకి చేరుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్వాహకులు మంట సెగను తట్టుకోలేకపోతున్నారు. వాన కాలంలో పరిస్థితి మరింతా దారుణంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వంట గదులను నిర్మించడంతో పాటు గ్యాస్ సిలిండర్లను అందించాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న తరగతి గది స్లాబ్ కింద వంట చేస్తున్న నిర్వాహకురాలు

గావ్ బస్తీ.. చలో అభియాన్

మల్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మల్యాలలో బుధవారం బీజేపీ నాయకులు గావ్ బస్తీ.. చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులు ఇంటింటికి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా 150మంది బీజేపీ కార్యకర్తలకు హెల్మెట్లు అందజేశారు. మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, కన్వీనర్ పొన్నం సాయికుమార్‌గౌడ్, బొట్ల ప్రసాద్, కొల్లూరి గంగాధర్, సంగని రవి, ముదుగంటి వనిత, సురేశ్, మల్లేశంయాదవ్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శికి సన్మానం

రాయికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన చిట్యాల భూమయ్య తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు బుధవారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో భూమయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇరువురు ఉపాధ్యాయులు బుధ వారం బదిలీపై వెళ్లగా విద్యార్థిని విద్యార్థులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మద్దెల రత్నం, దీపక్‌లను ఉపధ్యాయులకు రేగుంట, గుండంపల్లి పాఠశాలకు బదిలీ అయింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు విద్యార్థులు కరచలనం చేస్తూ చప్పట్ల నడుమ పాఠశాల ప్రధాన గేటు వరకు సాగనంపారు. జరిగిన ఆత్మీయ సన్మానంలో నాయకులు బిట్ల నరేష్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు నుంచి నీటి తరలింపు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని పాల చెరువు పరివాహక ప్రాతం ఉన్న రైతులకు సాగు నీరు అందించే విధంగా నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. పాల చెరువు నీరు అందేందుకు వాగు నుంచి చెరువుకు ఉన్న మాటు కాల్వ మరమ్మతులు చేసి నీరు తరలించే విధంగా గుత్తేదారు బాధ్యత తీసుకోవాలని కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఇరిగేష్న్ అధికారులు సూచించారు. చెరువు పరివాహ ప్రాతంలోని ఉన్న పంటలకు చెరువుకు ఆనుకోని ఉన్న తూం వద్ద అడ్డంగా వేసిన మట్టిని తొలగించి నీటిని సరఫరా చేయించారు. గత రెండు రోజుల క్రితం రైతులు సాగునీరుకు నీటిని అందిచాలని డిమాండ్ చేసిన దానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని సమస్యను పరిష్కారం చేూరు. అనంతరం రైతులు, గుత్తేదారుతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఏదైనా సమస్య ఉంటే సంబదింత అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సిరికొండలో పాదయాత్ర చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. బుధవారం కథలాపూర్ మండలంలోని సిరికొండలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలసి పాద యాత్రలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపు నిచ్చారు. బీజేపీ చాపకింద నీరులా మనువాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేయడానికి ఏఐసీసీ ఆదేశాల మేరకు గ్రామగ్రామానా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వీధుల వెంట నినాదాలు చేస్తూ పాద యాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, రేహాన్, రాజు, జవ్వాజి రవి, పులి హరిప్రసాద్, ఎగ్యారపు శ్రీహరి తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం'

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని యూసుఫ్ నగర్, అయిలాపూర్ గ్రామాల్లో భారత కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ప్రతిష్టా త్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ర్యాలీని నిర్వహించారు. గ్రామాలలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు నివాళులు అర్పించి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగానర్సింగరావు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ముందుండి పోరాటం చేయాలని అన్నారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, శశీంధర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పుల్లారెడ్డి, సురేష్ గౌడ్, అశోక్, గణేష్, రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

'పేదల సంక్షేమానికి సన్న బియ్యం పంపిణీ'

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసమే సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీతో పేదవారి కళ్లలో ఆనంద కనపడుతోందని ఆయన అన్నారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల, రాంచంద్రంపేట గ్రామాల్లోని లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి బియ్యం పంపిణీ చేసినప్పుడు ప్రజలు తినేందుకు ఆసక్తి చూపేవాళ్లు కాదన్నారు. ప్రస్తుతం సన్నబియ్యాన్ని ప్రభుత్వం అందజేయడంతో లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నరన్నారు. పేదల కోసం సంక్షేమం కోసం పథకాలు ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో పాలన చేసిన బీఆర్‌ఎస్ పేదలన పట్టించుకోలేదని, వారికి సన్నబియ్యం పంపిణీ చేయాలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు వంటి తదితర కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, నాయకులు జెట్టి లక్ష్మణ్, నాయిని సురేష్, గూరుడు తిరుపతి, సంజీవ్‌రెడ్డి, వంశీ, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం'

ధర్మపురి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరు పేదలకు సన్న బియ్యం పంపిణీ చారిత్రక నిర్ణయమని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, వైస్ చైర్మన్ సంగ నర్సింహులు అన్నారు. ధర్మపురి మండలంలోని దొంతాపూర్, మగ్గిడి-ఎడపల్లి గ్రామాల్లో గల రేషన్ షాపుల్లో బుధవారం వారు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ధర్మపురి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షులు రాజేందర్‌యాదవ్, సర్ద సాయికిరణ్, సత్యనారాయణగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



ధర్మపురిలో కేక్ తినిపిచుకుంటున్న ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు

ధర్మపురి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఇన్‌చార్జి యశోద యశ్వంత్ జెండా ఎగుర వేసి కేక్ కట్ చేసి కార్యకర్తలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యశ్వంత్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఎన్‌ఎస్‌యూఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని విధాల న్యాయం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, పట్టణ ఇంచార్జ్ భూపతి విగ్నేష్, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, బొల్లారపు పోషన్న, రాపర్తి సాయికుమార్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు కాశెట్టి రాజేష్, ఎన్ఎస్‌యు కార్యకర్తలు ముజీమ్, ఆశిర్, సమీర్, అజీమ్, ఆకాష్, సాయి, విశాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మల్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లిలో బుధవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రతి మొక్క పెంపకంకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. రైతులు ఈ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, శ్రీనివాస్, అనిల్, రైతులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ

ధర్మపురి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు కుంగ్ ఫూ లో ప్రతిభ కనబరచి యెల్లో బెల్టులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. రాణి లక్ష్మీభాయ్ ఆత్మ రక్షణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు మూడు నెలల పాటు కుంగ్ ఫూలో శిక్షణ అందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన 8 మంది విద్యార్థులకు డ్రాగస్ స్పోర్ట్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో బెల్టులు, సర్టిఫికెట్లు అందించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి, కుంగ్ ఫూ కోచ్ కస్తూరి ప్రవీణ్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు..

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం గ్రామ మాజీ సర్పంచు పూటుకూరి రాజశేఖర్‌రెడ్డి 10వేల రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దాతకు పలుకుల సంఘాల వారు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, కృతజ్ఞతలు తెలిపారు.

అంజన్న భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

-కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి

జగిత్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న దేవాలయంలో జరగనున్న చిన్న జయంతి ఉత్సవాలలో అంజన్న దీక్ష స్వాములకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంజన్న భక్తులు స్నానం ఆచరించేందుకు కోనేరులో ఎప్పటికప్పుడు నీటిని నింపాలని కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. భక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండే పరిస్థితి ఉన్నందున ఘాట్ రోడ్డుపై నుంచి భక్తులకు మినహా వాహనాలకు అనుమతి ఇవ్వకుండా చూడాలన్నారు. మాల విరమణ సమయంలో, దర్శన సమయంలో భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆముద రాజు, సిరికొండ రాజన్న, లింగారెడ్డి, రాము, శేఖర్, తిరుపతి తదితరులున్నారు.

'నిత్య జనగణమన'కు నేటితో మూడేళ్లు


పెగడపల్లిలో నిత్య జనగణమనలో పాల్గొన్న ప్రజలు

పెగడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్య జనగణమన కార్యక్రమానికి గురువారంతో మూడేళ్లు పూర్తకానున్నాయి. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థాన కమిటీ, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ యువత ఆధ్వర్యంలో సంయుక్తంగా శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా 10 ఏప్రిల్ 2022 నుంచి నిత్య జనగణమన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమం నిరాటంకంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న వ్యాపారులకు, మండల యువతకు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

● నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని ముత్యంపేట మాజీ సర్పంచ్ మల్యాల పోచయ్య(65) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వేకువజామున ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వాహనం వచ్చే వరకే తీవ్ర నొప్పితో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అంత్యక్రియలను గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ముత్యంపేటకు వచ్చిన్నప్పుడు ఆయనతో పోచయ్య సభావేదిక పంచుకున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

రవీంద్ర ప్లేస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక రవీంద్ర ప్లే స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూకేజీ పూర్తిచేసుకొని ఫస్ట్‌క్లాస్‌లోకి అడుగు పెడుతున్న సందర్భంగా విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో భీమయ్య హాజరై మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అనేది డిగ్రీ పూర్తయిన వారికే జరిగేదని, కానీ ప్రీ ప్రైమరీ లెవల్‌లో జరుపుకోవడం చాలా ఆనందదాయకం అన్నారు. చిన్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ చేయడం మర్చిపోలేని అనుభవం అన్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, డైరెక్టర్‌లు సుమన్‌రావు, హరిచరణ్‌రావు, కొమురవెల్లి కిషన్, రాజు, మౌనికతో పాటు పోషకులు, విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు శిక్షణ

కథలాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న అహార శుద్ధి యూనిట్ల లబ్ధిదారులకు మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, లేబలింగ్, బాండింగ్, డిజైనింగ్, ప్యాకింగ్, డిజిటల్ మార్కెటింగ్, అహార శుద్ధి, క్లీనింగ్, ప్రాసెసింగ్, కల్తీ లేని నాణ్యత గల శుభ్రమైన అహార పదార్థాల తయారీ గురించి డీఆర్‌పీ రామకృష్ణ అవగాహన కల్పించారు. సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి తీరుపై వివరించారు. ఈ సందర్భంగా డీఎల్‌టీ నరహరి, డీపీఎం సూదం వెంకటేశ్, సీసీలు అంజయ్య, విజయలక్ష్మీ, అశోక్ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి విప్ పరామర్శ

పెగడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి జీవన్ రెడ్డిని బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లు పరామర్శించారు. జీవన్‌రెడ్డి మామ ముత్యం రెడ్డి మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యంలు, వివిద పార్టీల నాయకులు ముత్యం రెడ్డి పార్థీవ దేహానికి నివాళులర్పించి , జీవన్ రెడ్డిని పరామర్శించారు.

'రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం'

మల్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మల్యాలలో బుధవారం బీజేపీ నాయకులు గావ్ బస్తీ.. ఛలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులు ఇంటింటికి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయో రోజుల్లో తెలంగానలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా 150 మంది బీజేపీ కార్యకర్తలకు హెల్మెట్లు అందజేశారు.మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, కన్వీనర్ పొన్నం సాయికుమార్‌గౌడ్, బొట్ల ప్రసాద్, కొల్లూరి గంగాధర్, సంగని రవి, ముదుగంటి వనిత, నులుగొండ సురేశ్, కొక్కెర మల్లేశంయాదవ్, లత, రమ, కెల్లెటి రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరగబోయే స్థానిక సంస్థలలో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్, వెల్లుల్ల గ్రామాల్లోని క్రియాశీల కార్యకర్తలతో బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం తీసుకోచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుల కోసగంటి మహేష్, పీసు రాజేందర్‌రెడ్డి, మారు జనార్థన్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, ఏలేటి శ్రీనివాస్, అల్లూరి అనిల్, రాకేష్, శరత్, కిరణ్, శేఖర్, హన్మండ్లు, రవి, గణేష్, రాజాగంగారం, కమలాకర్, శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాబోవు కాలంలో బీజేపీ విజయాన్ని ఎవరు అపలేరని బీజేపీ రాష్ట్ర నాయకులు మంచె రాజేష్ అన్నారు. బీజేపీ 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ధర్మపురి పట్టణంలోని కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో, మండలంలోని కమలాపూర్ గ్రామంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి అధ్యక్షతన క్రియాశీల సభ్యులు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేష్ మాట్లాడారు.

'పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, మైతాపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జగిత్యాల రూరల్ మండలం పొలాస క్లస్టర్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. బాలింతలు మొదటి ఆరు నెలల్లోపు బిడ్డలకు తల్లిపాలు పట్టించాలని అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, అంగన్‌వాడీ టీచర్స్ ఉమారాణి, జమున, కళావతి, స్వరూప, ఏఎన్ఎం స్వరూప, ఆశాకార్యకర్తలు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

● **జగిత్యాల అగ్రికల్చర్:** పోషణ పక్షోత్సవాలలో భాగంగా బుధవారం గర్భిణుల ఇంటిని అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్త సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తీసుకుంటున్న ఆహారం అలాగే సరైన విధంగా మందులు వాడే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతినెల ఆసుపత్రిలో చెకప్ చేయించుకోవడంతో పాటు, వైద్యురాలు ఇచ్చే సలహాలు, సూచనలు పాటిం చాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు ప్రసవం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వప్న, ఆశా కార్యకర్త బత్తిని వసంత పాల్గొన్నారు.

● **రాయికల్:** రాయికల్ మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడంతో పాటు తగు సలహాలు, సూచనలు, ఆహార పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు పద్మలత, బంతి శాంత, మమత, కుంట సుజాత, ఆశ కార్యకర్తలు సుమలత, రమాదేవి, ఆయాలు వెంకమ్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **మల్యాల:** మల్యాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ గర్భస్థ శిశువు నుంచి పిల్లలు జన్మించిన రెండు సంవత్సరాల వరకు పిల్లల అభివృద్ధి ఎక్కువగా ఉంటుందని, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. గర్భిణీలు, బాలింతల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, టీచర్లు స్వప్న, సంతోషి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● **కొడిమ్యాల:** మండల కేంద్రంలోని, మండలంలోని పూడూర్ అంగన్‌వాడీ కేంద్రాలలో సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు గర్భిణీల ఇంటింటికి వెళ్లి అవగాహన కలిపించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

● **కథలాపూర్:** మండలంలోని రాజారాం తండా గ్రామ పంచాయతీలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం గృహ సందర్శన చేసి తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

● **మల్లాపూర్:** మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని మల్లాపూర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. బుధ వారం మండలంలోని రాఘవుపేట తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి గర్భిణీ, బాలింతల ఇండ్లకు వెళ్లి తీసుకోవాల్సిన ఆహారం, పిల్లల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిం చారు. తల్లి పాల అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంజన్న భక్తుల కోసం చలివేంద్రం

మల్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి నేపథ్యంలో తరలివచ్చే దీక్షపరుల సౌకర్యార్థం కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆమె వెంట కొండగట్టుకు చెందిన సోయం విక్రం, గుర్రం మల్లేశంగౌడ్, ముత్యం మధు, పంజాల శ్రీనివాస్, మర్రి రాజేశం, దీక్షపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

కొడిమ్యాల, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తిర్మాలాపూర్‌లో బుధవారం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ నాయకులు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో మల్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లం పాపిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మర్రిపెల్లి శంకర్, పాల కేంద్రం అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయండి'


గోడపై పెయింటింగ్ వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రజలను కోరారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే హలో చొప్పదండి- చలో వరంగల్ అని వాల్ రైటింగ్ ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే గులాబీ పండగకు ప్రజలు అదిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడేది బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం ఐతేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, స్వామి, రాజేందర్‌గౌడ్, రాజు, చందు, మల్లయ్య, సాయి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ వితరణ

గొల్లపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్న పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో జమునా దేవి ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను అందించి బుధవారం ఔదార్యంను చాటుకున్నారు. రానున్న రెండు మాసాల్లో పదవి విరమణ చేయనున్న ఎంఈవో జమునా దేవి తాను ప్రధానోపాధ్యాయురాలుగా గత పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు తాగు నీటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో రూ. 40 వేల విలువ చేసే ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. ఈ మేరకు పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను అందించి ఉదారతను చాటిన జమునా దేవిని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి, కరుణాకర్, సుదాకర్, రాజేశం, హరికృష్ణ, సత్య, రవీందర్, బాలచంద్రుడు, కుమారస్వామి, చంద్రశేఖర్, శరత్ చందర్, విజయ, స్రవంతి, నందయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత

గొల్లపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం బీంరాజ్ పల్లె గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మారంపల్లి అఖిల వివాహం బుధవారం జరగ్గా గ్రామానికి చెందిన బీకేబి ట్రస్ట్ చైర్మన్ బొమ్మెన కుమార్-మాదవి దంపతులు పెళ్లి కానుకగా 5 తులాల వెండి అభరణాలు అందించి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా నిరుపేద యువతి వివాహానికి అండగా నిలిచిన బొమ్మెన కుమార్ దంపతులను గ్రామస్థులు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చిర్ర దిలీప్, నాయకులు కొలగాని తిరుపతి, గంగాచారి, స్వామి, సతీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.